జగనన్నతోనే సంక్షేమం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- చెర్లోపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారురాలికి బుక్‌లెట్ ఇస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం చెర్లోపల్లె పంచాయతీ ఏనుగుండ్లపల్లెలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల్ని లబ్ధిదారుల ×ఇంటి ముంగిటకే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో ఒక్కో ఇంటికి రూ.లక్షల్లో మేలు కలిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని గత టీడీపీ ప్రభుత్వానికి, ఇప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. 15 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించి ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని చంద్రబాబు, తమ సీఎం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. చంద్రబాబుకు అధికారం మీద ఉన్న మోజు ప్రజాసంక్షేమం పై లేదని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎంఎస్ బాబునాయుడు, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు త్యాగరాజులు, సంపత్, అమర్‌నాథ్‌రెడ్డి, హరినాథరెడ్డి, పాండియన్, పూర్ణచంద్ర, సుబ్రమణి, హరి, దేవేంద్ర రెడ్డి, రాబర్ట్, కన్నన్, ధర్మారెడ్డి, దిలీప్, దిలీప్‌రెడ్డి, రాజేంద్ర, సాము, నాగేంద్ర, రంజన్ పాల్గొన్నారు.

ఉచిత మాక్ టెస్ట్‌కు విశేష స్పందన



ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రఘువీర్‌వర్ధన్

చిత్తూరు కలెక్టరేట్ : కుట్టి కోచింగ్ సెంటర్ శుక్రవారం నిర్వహించిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉచిత మాక్‌టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 400 మంది వరకు అభ్యర్థులు ఈ టెస్టుకు హాజరయ్యారు. ఈ పరీక్షలో 113 మార్కులతో మొదటి స్థానంలో వంజరపు నరస్‌నాయుడు (విశాఖపట్నం), 102 మార్కులతో 2వ స్థానంలో లక్ష్మణ్ (కడప), 99 మార్కులతో 3వ స్థానంలో సయ్యద్ షమీ ఉల్లా (బొమ్మసముద్రం, గుడిపాల మండలం)నిలిచారని ఆ కోచింగ్ సెంటర్ నిర్వాహకురాలు పవనకుమారి తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రఘువీర్‌వర్ధన్, సంస్థ డైరెక్టర్ రామకృష్ణ చేతుల మీదుగా ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన నరస్‌నాయుడు స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండటం గమనార్హం! ఎస్‌ఐ కావాలనే లక్ష్యంతో తాను ప్రిపేర్ అవుతున్నట్టు ఆయన చెప్పాడు. కార్యక్రమంలో అభ్యర్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

– సెబ్ చిత్తూరు అర్బన్ సీఐ జోగేంద్ర

చిత్తూరు కలెక్టరేట్ : యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోరాదని సెబ్ చిత్తూరు సీఐ జోగేంద్ర అన్నారు. శుక్రవారం నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లే శక్తి యువతకు ఉందన్నారు. యువకులు డ్రగ్స్, మత్తుపదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తు, ఆరోగ్యాన్ని నాశనం చేసుకోరాదని హితవు పలికారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14500కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాబు, సిబ్బంది, లెక్చరర్లు పాల్గొన్నారు.

సులభ రీతిలో బోధన సాగాలి

యాదమరి: విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో పాఠ్యాంశాల బోధన సాగాలని ఎంఈఓ రుక్మిణి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఎంఈఓ కార్యాలయంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అకడమిక్ విషయాలు, పాఠశాల నిబంధనలు, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించాలన్నారు.

హరిత నగరాల పనులు పరిశీలన



గాంధీ విగ్రహం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం, కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో 'జగనన్న హరిత నగరాలు' కార్యక్రమంలో చేస్తున్న పనులను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు నగర్ కమిషనర్ జె.అరుణతో కలిసి పరిశీలించారు. స్థానిక గాంధీ విగ్రహం కూడలి, ఫౌంటెన్, ఎంఎస్ఆర్ కూడలి ప్రాంతాల్లో గ్రీనరీ పనులను, మురుకంబట్టు, చిత్తూరు పుత్తూరు రోడ్, గాయత్రీ నగర్, సీబీ రోడ్ ప్రాంతాల్లో డివైడర్లలో పచ్చదనం పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఎంఎస్ఆర్ సర్కిల్ నుంచి గాంధీ విగ్రహం వరకు, రైల్వే పై వంతెన ప్రాంతాల్లోనూ మొక్కలు పెంచడానికి సరైన ప్లానింగ్ ఇవ్వాలని కోరారు. జగనన్న హరిత నగరాలు కార్యక్రమానికి సంబంధించి నగరపాలక సంస్థకు మంజూరు చేసిన 15 పనుల్లో ఇప్పటికే 12 పనులు పూర్తి చేసినట్లు కమిషనర్ చెప్పారు. అనంతరం నగరపాలక కార్యాలయంలో అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీ అర్బన్ గ్రీన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీనియర్ ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఎస్‌ఈ రాంబాబు, ఈఈ రమేష్ , ఎంఈ ధనలక్ష్మి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



చిత్తపార సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుడిపాల: అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. చిత్తపార గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సంక్షేమ పథకాల లబ్ధి, అర్హుల వివరాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, స్పందన, సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సంబంధిత శాఖలకు అప్‌లోడ్ చేయడంతోపాటు విధిగా రిజిస్టర్లలో వాటి వివరాలు నమోదు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రీసర్వే సమగ్రంగా చేయాలన్నారు. గుడిపాల మండలానికి సంబంధించి 27 రెవెన్యూ గ్రామాలకుగాను 3 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారని, ప్రస్తుతం 7 గ్రామాల్లో సర్వే పనులకు 7 బృందాలు పని చేస్తున్నాయన్నారు. డ్రోన్ సర్వే, గ్రామ సరిహద్దులు నిర్ణయించే ప్రక్రియ పూర్తి చేసినట్లు తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీ ఉపేంద్ర, పీఆర్ ఏఈ జయచంద్రా రెడ్డి, డీటీ మురళీకృష్ణ, సర్వేయర్ గణేష్, ఎంఈఓ రాము నాయక్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువులయ్యాక సమాజసేవ చేయండి



ఆఫ్రాన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు రూరల్: సమాజంలో వైద్యులకు విలువ, గౌరవ మర్యాదలు ఇస్తారని, ఈ నేపథ్యంలో వైద్య విద్యార్థులు చదువులు ముగిశాక సమాజసేవలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ పిలుపునిచ్చారు. శుక్రవారం చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం వైద్యవిద్య విద్యార్థులకు ఆఫ్రాన్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సమాజంలో వైద్యుల కొరత ఉందని, మరింత ఎక్కువ మంది వైద్య విద్యను అభ్యసించి సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. కరోనా కాలంలో వైద్యులు అందించిన సేవలు విలువ కట్టలేనివన్నారు. డాక్టర్లకు గుర్తింపు తెల్లటి ఆఫ్రాన్ అని... ఈ ఆఫ్రాన్ శాంతికి చిహ్నమన్నారు. కార్యక్రమంలో అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వినోద్ బట్, డీన్ ఆల్‌ఫ్రెడ్ ఆగస్టీన్, అపోలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్‌రెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు



కాణిపాకం : సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు



అర్ధగిరి క్షేత్రంలో సుదర్శన హోమం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అలంకరణలు జరిగాయి. భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి ప్రాకారోత్సవం వేడుకగా నిర్వహించారు. ఉత్సవమూర్తికి అభిషేక పూజలు చేసి సుందరంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి ఆలయం, పుష్కరిణి చుట్టూ ఊరేగించారు. వేడుకలను తిలకించేందుకు విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు అందజేశారు. భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అనుబంధంలోని శ్రీవరదరాజులస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత మూల స్థానంలో వెలసిన శ్రీశ్రీదేవి, పెరుందేవి సమేత వరదరా జులస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని సత్యనారాయణస్వామిగా అలంకరించి ఆలయ ఆవరణలోని వేదికపై కొలువుదీర్చారు. పండితులు శాస్త్రోక్తంగా వ్రతం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంతకు ముందు ఆలయంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గరుడవాహనంపై వరదరాజులస్వామి పురవీధుల్లో విహరించారు.

క్లుప్తంగా

'మధ్యాహ్న భోజనం' తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం సిద్దంపల్లె జెడ్పీ హైస్కూలును శుక్రవారం డీవైఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థుల సంఖ్యను పెంచేలా విద్యాబోధన చేయాలని, విద్యార్థులు స్కూలుకు గైర్హాజరైతే వారి వివరాలు కచ్చితంగా ఉండాలన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం



బంగారుపాళెం: చీఫ్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా స్థానిక డీసీసీ బ్యాంక్ మేనేజర్ గంగిరెడ్డిని శుక్రవారం సిబ్బంది సన్మానించారు. కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, సీఈఓ రామ్మూర్తి, సిబ్బంది శివకుమార్, దుర్గాప్రసాద్, దేవేంద్రరాజు, శ్రీనివాసులు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

శరవణకు డాక్టరేట్



శరవణ

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరుకు చెందిన శరవణకు ద్రావిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన ద్రావిడ వర్సిటీలో ఆచార్య అనురాధ పర్యవేక్షణలో 'ట్రాన్స్‌మిషన్ ఆఫ్ ఫోరెన్సిక్ డిజిటల్ ఎవిడెన్సిస్ బై యూజింగ్ క్రిప్టోగ్రఫీ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకుగాను ఆ యూనివర్సిటీ పరీక్షల విభాగం నియంత్రణ అధికారి నాగేశ్వరరావు డాక్టరేట్‌ను ప్రకటించారు.

ఆర్‌ఎంపీలు ఇంజెక్షన్లు వేస్తే చర్యలు



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ ప్రకాశం

యాదమరి: మండలంలోని ఆర్‌ఎంపీలు ఇంజెక్షన్లు వేస్తే చర్యలు తప్పవని డీఎం అండ్ హెచ్‌ఓ ప్రకాశం హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులు డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయానికి వచ్చాయి. ఈ ఫిర్యాదుపై డీఎం అండ్ హెచ్‌ఓ ప్రకాశం, స్థానిక వైద్యులు శ్రీనివాసుల నాయక్, శివకుమార్ రెడ్డి, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణతో కలసి మండల కేంద్రంలో ఉన్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేశారు.

రెచ్చగొట్టేందుకే చంద్రబాబు షోలు



ఎంపీపీ రెడ్డెప్ప

పలమనేరు: తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టేందుకే చంద్రబాబు కుప్పంలో షోలు నిర్వహిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ కుప్పం పరిశీలకులు, బైరెడ్డిపల్లె ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కుప్పం ఎత్తిపోయిందని చంద్రబాబుకు బాగా అర్థమైందన్నారు. ఎలాగైనా కుప్పం ప్రజలను ఏమార్చేందుకు రావడం మంత్రి పెద్దిరెడ్డిని, పోలీసులను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రెండ్రోజులు కుప్పానికి వచ్చిన పాపానికి ఆ పార్టీ కార్యకర్తలు కేసులతో పడుతున్న కష్టాలు చంద్రబాబుకు పట్టవన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం అమాయకుల ప్రాణాలు పోయి నా తన నైజాన్ని మార్చుకోవడం లేదన్నారు.

సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



పలమనేరు: పట్టణ సమీపంలోని రొంటకుంట్ల వద్ద వెలసిన రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతం చేయడంతో కలిగే మేలును అర్చకులు వెంకటేష్ అయ్యంగార్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

నాడు వంచన.. నేడు సంక్షేమం



బొమ్మసముద్రంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు నాడు హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచిస్తే, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందిస్తూ అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. మండలంలోని చిగరపల్లె సచివాలయ పరిధిలోని బొమ్మసముద్రం, బొమ్మసముద్రం దళితవాడ, తిమ్మోజిపల్లెలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 190 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను 98శాతం జగనన్న నెరవేర్చారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు తుంగలో తొక్కి ప్రజలను దగా చేశారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, నేత చలపతి రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, సర్పంచులు రఘు, శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాబు, మండల యూత్ కన్వీనర్ భార్గవ్ రెడ్డి, నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, ఏఎంసీ మెంబర్ రామచంద్ర, పార్టీ నేతలు ముదిగోళం సురేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కరుణాకర్‌నాయుడు, నాగరాజ, సురేంద్రయాదవ్, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు అడుగు పెడితే మారణహోమం

రాష్ట్రంలో చంద్రబాబు ఎక్కడ అడుగు పెట్టినా మారణహోమం జరుగుతోందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిన్న కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంలో ఉంటూ స్థాయి మరచి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, మాట తీరును చంద్రబాబు మార్చుకోవాలని ఎమ్మెల్యే హితవు పలికారు. జిల్లాను ప్రగతి పథంలో నడుపుతున్న పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేయడం ఓర్వలేనితనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు బాబు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. బాబు తప్పులను కప్పిపుచ్చుతూ ఎల్లో మీడియా అవాస్తవ రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.



పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పింఛన్ల పంపిణీ

యాదమరి: మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు పాల్గొన్నారు ఎంపీపీ సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో ఈనెల నుంచి 46,919మంది లబ్ధిదారులకు రూ.12.49కోట్లు పింఛన్ నగదు అందిస్తున్నట్లు వివరించారు. నూతనంగా 294 మందికి పింఛన్లు అందజేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ శివరాజ్, తహసీల్దార్ చిట్టిబాబు, నాయకులు మనోహర్ రెడ్డి, కబీర్‌బాషా పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా చేయాలి



యాదమరిలో రీ సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించి, పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ హరినారాయణన్ కోరారు. శుక్రవారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మొదటగా పలు గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణం, నాడు–నేడు పనులను పరిశీలించారు. భవనాల నిర్మాణాలు చాలావరకు పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్‌తో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో భూరికార్డుల పరిశీలన క్షుణంగా నిర్వహించి వీఆర్‌లో అప్‌లోడ్ చేసిన వివరాలు పర్యవేక్షించాలని కోరారు. మండలంలో 24 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్‌షాట్ పూర్తి చేశామన్నారు. సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని సచివాలయ సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యాదమరి సచివాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అలాగే పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, పీఆర్ ఏఈఓ జయచంద్రా రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్, ఎంఈఓ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఓం శక్తి భక్తుల యాత్రలో అపశృతి

- తెలంగాణలో చెట్టును ఢీకొన్న టూరిస్టు బస్సు
- మృతి చెందిన డ్రైవర్ బాబు
- ఉత్తరబ్రాహ్మణపల్లెకు చెందిన 40 మంది ఓం శక్తి భక్తులు సురక్షితం



తెలంగాణ రాష్ట్రం వెంకటాపురం శివాలయంలో సేదతీరుతున్న ఉత్తరబ్రాహ్మణపల్లె ఓం శక్తి భక్తులు

తవణంపల్లె: తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వెంకటాపురం మండలం అంకెన్నగూడెం సమీపంలో శుక్రవారం టూరిస్టు బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో తవణంపల్లె మండలం ఉత్తర బ్రాహ్మణపల్లెకు చెందిన 40 మంది ఓం శక్తి భక్తులు, క్లీనర్ రాజు సురక్షితంగా ప్రాణాలతో బయటపడగా, డ్రైవర్ బాబు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. పెను ప్రమాదం తప్పడంతో భక్తులు ఊపిరి పీల్చుకొన్నారు. బస్సులో ప్రయాణిస్తున్న ఉత్తరబ్రాహ్మణపల్లెకు చెందిన వినోద్ కథనం మేరకు.. ఈ నెల 2వ తేదీ రాత్రి ఏడు రోజుల దేవాలయాల యాత్రకు 40 మంది గ్రామస్తులు చిత్తూరుకు చెందిన కార్తీక్ ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. శుక్రవారం భద్రాచలం దర్శనం అనంతరం యాదాద్రికి బస్సు వెళుతోంది. సాయంత్రం 4గంటల సమయంలో మార్గమధ్యంలో అదుపుతప్పి బస్సు చెట్టును ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే పరిసర గ్రామస్తులు, వెంకటాపురం పోలీసులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులందరికీ వెంకటాపురం శివాలయంలో షెల్టర్ ఇచ్చారు. ఆర్‌ఎంపీ డాక్టర్ భోజన వసతి కల్పించారు. ఎస్‌ఐ పండ్లు పంపిణీ చేశారు. మరో రెండు రోజులు యాత్ర చేయాల్సి ఉండగా, ప్రమాదం జరగడంతో పోలీసుల సహకారంతో గ్రామానికి తిరుగు ప్రయాణం అవుతున్నట్లు వినోద్ తెలిపారు. డ్రైవర్ బాబు సోమవారం నుంచి అనారోగ్యంతో బాధపడుతూనే డ్రైవింగ్ చేశాడని పేర్కొన్నారు. గ్రామస్తులు, బంధువులు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, న్యాయమూర్తులు కార్తీక్, సింధు

పుంగనూరు: రాష్ట్ర లీగల్ సర్వీసస్ అథారిటీ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవారావు తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సింధుతో కలసి ఆయన న్యాయవాదులతో, అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీకి అనువైన కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులు సమన్వయంతో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులపై అప్పీల్ ఉండదని తెలిపారు. దీంతోపాటు కేసులకు కోర్టు ఫీజులు వాపసు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 55 మంది హాజరు

పలమనేరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 25 అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూలకు 55 మంది హాజరయ్యారు. వీరిని ఆర్డీఓ శివయ్య, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ హరినాథరెడ్డి, సీడీపీఓలు మాధవీలత, రాజేశ్వరి, వాణిశ్రీదేవి, సుజాతలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలు త్వరలోనే తెలియజేస్తామన్నారు